# ఆర్టీఏలకు కొత్త కార్యాలయాలు

## ఇప్పటికే అందుబాటులో రంగారెడ్డి ప్రధాన కార్యాలయం

## త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మన్నెగూడ ఆఫీసు

సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : మహా నగరంలో రెండు కొత్త ఆర్టీఏ భవనాలు అందుబాటులోకి వచ్చాయి. మణికొండలోని శివపురికాలనీలో సుమారు రూ.5 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మించారు. ఇప్పటికే అత్తాపూర్‌లోని అద్దె బిల్డింగ్‌లో కొనసాగిన రంగారెడ్డి ఆర్టీఏ ప్రధాన కార్యాలయం కార్యకలాపాలను ఈ కొత్త భవనంలోకి మార్చారు. అధికారులు ఇక్కడి నుంచే కొన్ని రోజులు నుంచి సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు మన్నెగూడలోని మరో ఆర్టీఏ కార్యాలయం పాత బిల్డింగ్‌లో కొనసాగుతున్నది. అక్కడే మరో కొత్త భవనాన్ని నిర్మించారు. ఈ భవన ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన సమయంలో ఎలక్షన్ కోడ్ రావడంతో ఆగిపోయింది. కొత్త ఏడాది మొదటి వారంలో ఈ భవనం ప్రారంభోత్సవం జరుగుతుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. కాగా గ్రేటర్‌లో 12 ఆర్టీఏ కార్యాలయాలున్నాయి. హైదరాబాద్‌లో ఖైరతాబాద్, సికింద్రాబాద్, మలక్‌పేట్, బండ్లగూడ, టోలిచౌకి, నాగోల్ ఉండగా మేడ్చల్‌లో డీటీవో మేడ్చల్, ఉప్పల్, కూకట్‌పల్లి ఉన్నాయి. రంగారెడ్డిలో మణికొండ, మన్నెగూడ, కొండాపూర్ కార్యాలయాలు సేవలు అందిస్తున్నాయి.



మణికొండలోని రంగారెడ్డి జిల్లా ఆర్టీఏ ప్రధాన కార్యాలయం

## ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలితారమేశ్

మర్పల్లి, డిసెంబర్ 28:ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఎంపీపీ లలితా రమేశ్ అన్నారు.. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ ఎజెండాను చదివి వినిపించారు.. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న లూప్‌వైర్లను సరి చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను త్వరలో అందేలా చూడాలని జడ్పీటీసీ మధుకర్ తహసీల్దార్ గణేశ్‌ను కోరారు. ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న అభయ హస్తం గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకునేలా గ్రామ ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఏవో వసంత, కో–ఆప్షన్ సభ్యుడు సోహెల్,ఎంపీటీసీలు మల్లేశం, బాల్‌రెడ్డి, బిచ్చయ్య, రవీందర్, ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు..



చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించిన శిక్షణ న్యాయమూర్తుల బృందం సభ్యులతో జైళ్ల శాఖ ఐజీ మురళిబాబు, హైదరాబాద్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ వెంకటరామ్, జైలు అధికారులు

## చర్లపల్లి జైలు సందర్శించిన న్యాయమూర్తులు

చర్లపల్లి, డిసెంబర్ 28 : చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని జిల్లా కోర్టు న్యాయమూర్తులు శిక్షణలో భాగంగా సందర్శించారు. వివిధ జిల్లాలకు చెందిన న్యాయమూర్తులు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వెంకటరామ్, జైళ్ల శాఖ ఐజీ మురళిబాబు, హైదరాబాద్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించి ఖైదీలు, సిబ్బందిని పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ జైలులోని ఖైదీల స్థితిగతులు, వారి దినచర్య, ఖైదీలకు అమలు చేస్తున్న ఉపాధి కార్యక్రమాల వివరాలను న్యాయమూర్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటిండెంట్లు కృష్ణమూర్తి, శశికాంత్, కాళిదాస్‌తో పాటు జైలర్లు, డిప్యూటీ జైలర్లు, వైద్య అధికారులు, సిబ్బంది, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేతపై నిరసన

### వినియోగదారుడి ఆందోళనతో దిగివచ్చిన అధికారులు.. సమస్య పరిష్కారానికి హామీ

తుర్కయాంజాల్, డిసెంబర్ 28 : విద్యుత్ శాఖ అధికారులు ఇష్టానుసారంగా విద్యుత్ బిల్లును వేసి ఇంటి విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో తుర్కయాంజాల్‌కు చెందిన క్రాంతి గురువారం రాగన్నగూడలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు మీటర్‌ను స్కాన్ చేయకుండా మూడు నెలల పాటు మినిమమ్ బిల్లు వేశారు. తిరిగి 3 నెలల తరువాత మీటర్‌ను స్కాన్ చేసి రూ.8700 బిల్లును వేశారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులను కలిసి సమస్యను వివరించగా, రిక్వెస్ట్ లెటర్ పెట్టుకుంటే పరిశీలన చేసి బిల్లును తగ్గిస్తామని తెలిపారు. నెల రోజులు గడిచినా ఎలాంటి విచారణ చేయకండా మరో నెల బిల్లు కలిపి రూ.9000 విద్యుత్ బిల్లును వేశారు. వెంటనే బిల్లును చెల్లించాలని లేని యెడల విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడడమే కాకుండా గురువారం కనెక్షన్‌ను కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లును పరిశీలించిన అనంతరమే విద్యుత్ బిల్లు కడుతానని విద్యుత్ శాఖ అధికారులను కోరినా తమకు సంబంధం లేదని మొదట బిల్లు చెల్లించాలని లేని పక్షంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారని తెలిపారు. క్రాంతి విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించడంతో అధికారులు క్రాంతి ఇంటి విద్యుత్ కనెక్షన్ తిరిగి పునరుద్ధరించారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బిల్లు అధికంగా రావడానికి గల కారణాలు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



నిరసన చేపడుతున్న క్రాంతి

## పోలీస్ వాహనాల విడిభాగాలు వేలం: ఎస్పీ

వికారాబాద్, డిసెంబర్ 28 : జిల్లా పోలీస్ వాహనాలకి ఉపయోగించిన విడిభాగాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ కోటిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ వాహనాలకు ఉపయోగించిన కాల సమయాన్నీ దాటిన విడిభాగాలను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఈ నెల 30న ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు వేలంపాటలో పాల్గొని తమ సొంతం చేసుకోవాలని తెలి పారు. టైర్స్, ట్యూబ్స్ , బ్యాటరీలు, వాహనముల విడిభాగములు, వాడి న ఇంజన్ ఆయిల్, బ్యారెల్స్ ఈ వేలంపాటలో ఉన్నాయన్నారు.



వికారాబాద్, డిసెంబర్ 28 : జిల్లా ప్లంబర్ వర్కర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను జిల్లా కేంద్రంలో గురువారం వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్లంబర్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మహారాష్ట్రకు చెందిన డ్రగ్స్ ముఠా అరెస్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): న్యూ ఇయర్ వేడుకలకు హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేసేందుకు వచ్చిన మహారాష్ట్రకు చెందిన డ్రగ్ స్మగ్లింగ్ ముఠాను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం సెంట్రల్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శరత్ చంద్ర వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన అనూప్ నవనాత్ సోనవాలే అలియాస్ సుమిత్ పుణేలో మెకానిక్ ఇంజినీర్ చేసి, ఎండీఎంఏ డ్రగ్‌కు అలవాటు పడ్డాడు. 2020 నుంచి డ్రగ్ విక్రేతగా మారాడు. 2022లో హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) అతడిని అరెస్ట్ చేసింది. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత ముంబైలోని నాలసోప్రకు వెళ్లి ఆఫ్రికా దేశస్తుడైన జోయ్ వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసి, దానిని పుణేలోని కిరణ్ గంగాధర్ బోమ్నలె అలియాస్ రాహుల్, వివేక్ రాజేశ్ వాఘూమరె అలియాస్ విక్కీ, హైదరాబాద్‌లో రియాజ్, ఆరిఫ్‌లకు సరఫరా చేస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ గిరాకీ బాగుంటుందని సోనవానెకు సూచించారు. 150 గ్రాముల ఎండీఎంఏను జాయ్ వద్ద లక్ష రూపాయలకు కొనుగోలు చేశారు. దానిని తీసుకొని 27న హైదరాబాద్‌కు వచ్చి, సోమాజిగూడలోని మక్తా ప్రాంతానికి చేరుకున్నారు. తెచ్చిన డ్రగ్‌ను రియాజ్, ఆరిఫ్‌కు విక్రయించేందుకు ఎదురు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సెక్రటరియేట్ పోలీసులు కలిసి మహారాష్ట్రకు చెందిన అనూప్, కిరణ్, వివేక్‌ను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 102 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్ విలువ రూ. 7.10 లక్షల విలువ ఉంటుందని డీసీపీ తెలిపారు.

## పోలియోపై నిమ్స్‌లో సదస్సు

ఖైరతాబాద్, డిసెంబర్ 28: నిమ్స్ దవాఖానలో గురువారం ఇమ్యూనో డెఫీసియన్సీపై సదస్సు జరిగింది. ఈ సదస్సును డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో వ్యాప్తి, దాని వల్ల ప్రపంచ దేశాల్లో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ క్లినికల్ ఇమ్యూనాలజీ విభాగాధిపతి, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ సందీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కీర్తివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యానికి వచ్చి మృత్యుఒడిలోకి..



రాంసింగ్ (ఫైల్)

బొంరాస్‌పేట, డిసెంబర్ 28 : బంధువులు ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషాద సంఘటన బుధవారం రాత్రి బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బుర్రితండాలో జరిగింది. ఎస్సై శంకర్, తండావాసుల కథనం ప్రకారం మండలంలోని బాపల్లితండాకు చెందిన లక్ష్మీబాయి బుర్రితండాలో ఉంటున్న తన అన్న రవినాయక్ కూతురు వివాహానికి భర్త రాంసింగ్(40)తో కలిసి బుర్రితండాకు వచ్చింది. బుధవారం రాత్రి ఇంట్లో భోజనం చేసిన తరువాత రాంసింగ్ మూత్ర విసర్జన కోసం అంతర్జాతీయ రహదారిని దాటి వెళ్లాడు. తిరిగి రోడ్డును దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పరిగి దవాఖానాకు తరలిస్తుండగా మార్గమధ్యలో రాంసింగ్ మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మీబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

## న్యూ ఇయర్ వేడుకలకు అనుమతులు తప్పనిసరి

వికారాబాద్, డిసెంబర్ 28 : వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల రిసార్ట్‌లలో నూతన సంవత్సరం సందర్భంగా ఏవైనా ఈవెంట్స్ గానీ, వేడుకలు గానీ చేసుకోవడానికి ముందస్తు అనుమతులు తప్పని సరి అని అలా కాకుండా నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వికారాబాద్ సీఐ శ్రీను గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా నిర్వాహకులు తగు సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రిసార్ట్స్‌లో డ్రగ్స్ (మత్తు పదార్థాలు) గానీ, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదన్నారు. న్యూఇయర్ వేడుకలు అర్ధరాత్రి ఒంటిగంట వరకు ముగించాలని, 3.45 డిసిబుల్స్ శబ్దం కంటే ఎక్కువ శబ్దం ఉండవద్దన్నారు. అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని, ప్రతి ఈవెంట్లలో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లిక్కర్ ఈవెంట్లలో అనుమతి లేదని, మైనర్లను అనుమతించకూడదని తెలిపారు. కెపాసిటీకి మించి పాసులు ఇవ్వరాదని, సాధారణ పౌరులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించకూడదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడితే రూ. 10 వేల జరిమానా తో పాటు ఆరు నెలల జైలు శిక్ష , లైసెన్సులు రద్దు చేయబడుతాయని హెచ్చరించారు. ఈ చివరి మూడు రోజులు ప్రతి రిసార్ట్‌ను తనిఖీ చేస్తామన్నారు. ప్రతి రిసార్ట్‌కు ముందుగానే నోటీసులు జారీ చేశామని, ఎవరైనా రిసార్ట్ యజమానులు మేనేజర్లు పోలీసులు సూచించిన నిబంధనలు పాటించనిచో చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరికలు జారీ చేశారు.

## గ్రామాలకు అయోధ్య అక్షింతల కలశాల పంపిణీ



అక్షింతల కలశాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బొంరాస్‌పేట, డిసెంబర్ 28 : మండల కేంద్రంలోని భక్త సమాజంలో గురువారం అయోధ్య అక్షింతల కలశాలను గ్రామాలకు పంపిణీ చేశారు. గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అక్షింతల కలశాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా భూలక్ష్మీ దేవాలయానికి వెళ్లారు. అక్కడ అమ్మవారికి పూజలు చేసి గ్రామాలకు వెళ్లారు. జనవరి 1 నుంచి 15వ తేదీ మధ్యన గ్రామాల్లో ప్రజలకు కలశాలలో ఉన్న అక్షింతలను పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు.



మండల పరిధిలోని మంబాపూర్ గ్రామ ప్రధాన రోడ్డుమార్గంలో గురువారం సొంత ఖర్చుతో స్పీడ్ బ్రేకర్లకు రంగుల సూచికలను వేయిస్తున్న సర్పంచ్ శ్రావణ్ కుమార్ **-పెద్దేముల్, డిసెంబర్ 28**